ఈనాడు నారాయణపేట

మంగళవారం అక్టోబరు 1, 2024 7

ఊపిరి బిగపట్టుకోవాల్సిందే..!

గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేక అవస్థలు



నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్‌లో తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్నారు. ఇక్కడ మొత్తం 650 మంది విద్యార్థులుండగా 24 స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధన ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 57 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు ఉదయం సమయంలో ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కొందరు విద్యార్థులు బయటే స్నానం చేయాల్సి వస్తోంది.



నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలోని జ్యోతిరావు పులే బాలుర గురుకుల విద్యాలయంలో 5 నుంచి పదో తరగతి వరకు 480 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 15 స్నానపు గదులు, 10 మరుగుదొడ్లు ఉన్నాయి. నిబంధనల ప్రకారం 56 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. దీంతో విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతం. ఇక్కడ ఓ షెడ్డులో గురుకుల విద్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో స్నానానికి, కాలకృత్యాలకు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలమూరులో మొత్తం 32 ఎస్సీ, 25 బీసీ, 20 మైనార్టీ, 19 గిరిజన గురుకుల విద్యాలయాలున్నాయి. ఈ గురుకులాల్లో సుమారు 52 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పలు గురుకులాల్లో సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. నిబంధనల ప్రకారం ప్రతి 25 మందికి స్నానపు గదులు, 4 మరుగుదొడ్లు ఉండాలి. ఈ లెక్కన ఏ గురుకులాల్లోనూ ఇవిలేవు. ఉమ్మడి జిల్లాలో అన్ని గురుకులాల్లో కలిపి సుమారు 6,200 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. ఇందులో సగం కూడా లేనట్లు అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలని...: ఇటీవల ఓ సామాజిక కార్యకర్త రాష్ట్రంలోని పలు గురుకులాల్లో సౌకర్యాలపై సర్వే నిర్వహించారు. దీని నివేదికను హైకోర్టుకు సమర్పించగా ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక స్నానపు గది, ఏడుగురికి ఒక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించి నివేదిక ఇవ్వాలని గురుకులాలను కోరింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు గురుకులాల్లో సర్వే నిర్వహించగా అందులో ఏ గురుకలాల్లోనూ నిబంధన ప్రకారం సౌకర్యాలు లేవు. కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఆరుబయటకు వెళ్లే క్రమంలో కొన్ని చోట్ల పాములు, ఇతర క్రిమికీటకాలతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు.



వనపర్తి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో మొత్తం 699 మంది చదువుతున్నారు. వీరికి 50 స్నానపు గదులు, 78 మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ విద్యాలయంలో 83 చొప్పున స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండాలి. సరిపడా లేకపోవడంతో కాలకృత్యాలు తీర్చుకోడానికి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు వస్తే ఎంతో మేలు..: గురుకులాల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేయాలంటే ప్రత్యేక నిధులు కావాలి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ ఎస్సీ గురుకుల బాలికల విద్యాలయంలో మరుగుదొడ్ల సమస్య రావడంతో స్థానికంగా ఉన్న సంస్థ తరపున వాటికి మరమ్మతులు చేపట్టారు. కొత్తగా ఏర్పాటు చేయడానికి కూడా ముందుకొచ్చారు. అవసరమైన చోట గురుకులాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి మౌలిక సదుపాయాలు కల్పిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

స్వచ్ఛసేవలో న్యాయవిభాగం

నారాయణపేట, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కోర్టు ఆవరణ, పాత జైలు పరిసర ప్రాంతాల్లో జిల్లా న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ, సీనియర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు పరిశుభ్రత చేపట్టారు. చీపురు చేతబట్టి చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ ఎక్కడివారు అక్కడ పరిసరాలు శుభ్రం చేసుకుంటే వ్యవస్థకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందన్నారు. న్యాయమూర్తులు శ్రీనివాస్, ఉమర్, జకియా సుల్తానా, ప్రభుత్వ న్యాయవాది ఆకుల బాలప్ప, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దామోదర్ గౌడ్, న్యాయవాదులు నాగురావు నామాజీ, నందు నామాజీ, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

సరాఫ్ బజారు.. వెళ్తే బేజారు

నారాయణపేట బంగారం వ్యాపారానికి 128 ఏళ్ల చరిత్ర ఉంది.. నిత్యం కొనుగోలుదారులు, పనులపై వచ్చేవాళ్లతో సరాఫ్‌బజార్ కళకళలాడుతుంది. 146 అధికారిక బంగారం దుకాణాలు, పదుల సంఖ్యలో చిన్నదుకాణాలు ఇక్కడ ఉన్నాయి. మన రాష్ట్రం, కర్ణాటక, ఏపీ నుంచి జనం వచ్చిపోతుంటారు. ఇదంతా చెప్పుకోడానికి ఘనం... అక్కడి కనీస వసతులు లేకపోవడం దీనం.. 'న్యూస్‌టుడే' సోమవారం నిర్వహించిన ప్రత్యక్ష పరిశీలనలో పలు సమస్యలు కనిపించాయి.



ఇరుకుగా ఉన్న బంగారు వ్యాపారం జరిగే ప్రాంతం



సరాఫ్ బజారులో గుంతల మయంగా రోడ్డు

న్యూస్‌టుడే–నారాయణపేట

న్యూస్‌టుడే ప్రత్యక్ష పరిశీలన

ప్రధాన దుకాణాలు మహిళలతో కిటకిటలాడతాయి. కనీసం కూర్చోవడానికి సైతం స్థలం లభించని పరిస్థితి ఉంటుంది. కేవలం రెండు, మూడు దుకాణాల్లో తప్ప ఎక్కడా మరుగుదొడ్లు లేకపోవడం శోచనీయం. పురపాలక సంఘం కూడా సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు పడుతున్న వేదన వర్ణనాతీతం. పోలీసుశాఖ స్థలంలో ఇటీవల మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ స్థానికులు అభ్యంతరం తెలుపడంతో నిరుపయోగంగా మారాయి.

- రహదారి గుంతలమయంగా మారడంతో పాదాచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇదే సమస్య నెలకొంది. వర్షకాలంలో గుంతల్లో వర్షపునీరు నిలిచి రాకపోకలకు మరింత ఇబ్బందికరంగా మారుతుంది. డ్రైనేజీ వ్యవస్థ కూడా సక్రమంగాలేదు.
- సరఫ్ బజార్‌కు ప్రాంతమంతా ఇరుకుగా ఉండటంతో వినియోగదారుల వాహనాలు నిలిపేందుకు స్థలంలేదు. చౌక్‌బజార్ నుంచి సరాఫ్ బజార్‌మీదుగా పళ్ల ప్రాంతానికి వెళ్లాంటే రద్దీతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చాయంటే గంటలపాటు ట్రాఫిక్ జామ్ కావల్సిందే. పాఠశాలల సమయంలో విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.



దుకాణాల ముందు నిలిపిన వాహనాలు

ఇదీ వ్యాపారం సంగతి : 1898-99లో నారాయణపేటలో బంగారం వ్యాపారం ప్రారంభమయ్యింది. అప్పట్లోనే ఇది పురపాలకసంఘం కావడంతో నిజాం కాలంలోనే వ్యాపారం మొదలయ్యింది. తరువాత రాజస్థాన్ నుంచి వచ్చిన కుటుంబాలు ఈ వ్యాపారాన్ని విస్తరించాయి. ఉమ్మడి జిల్లాతోపాలు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కొనుగోలుకు వస్తుంటారు.

- బంగారు దుకాణాల సముదాయాలలో పార్కింగ్ ఇబ్బందికరంగా ఉంది. దుకాణాల ముందు వాహనాలు నిలిపిందుకు కూడా స్థలంలేదు. మహారాష్ట్ర, కర్ణాటక, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి బంగారు కొనుగోలుకు వాహనాల్లో వచ్చేవారు దూరంగా నిలిపి నడిచి రావాలి. లేదా ఆటోలో రావాలి. కొన్ని ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు నిలిపే పరిస్థితి కూడా లేదు. గత్యంతరం లేక రోడ్లపై ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో నిలిపితే పోలీసుల ఇబ్బంది తప్పడం లేదంటున్నారు.
- తమ సంఘంలోని సభ్యులతో మాట్లాడి వసతుల కల్పనకు కృషి చేస్తానని పేట బంగారం వర్తకుల సంఘం అధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ హరినారాయణ్‌బట్టడ్ 'న్యూస్‌టుడే'తో అన్నారు. మున్సిపల్, పోలీసు, ఇతర అధికారుల సహకారంతో బజారును బాగు చేస్తామన్నారు.

నిరీక్షణకు తెర

డీఎస్సీ ఫలితాలు విడుదల ● నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

పాలమూరు, నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల ఎంపిక రాత పరీక్ష (డీఎస్సీ) ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెరుగైన మార్కులు, ర్యాంకులు సాధించిన అభ్యర్థుల ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలను నేటి నుంచి 5వ తేదీ వరకు పరిశీలించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. 2024 డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో 1,131 పోస్టులను ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల క్రితం 20 రోజుల పాటు రాతపరీక్షలు నిర్వహించారు. టెట్‌లో 20, డీఎస్సీ రాత పరీక్షలో 80 చొప్పున మొత్తం 100 మార్కులు ఉంటాయి. ఇందులో ఎక్కువ మార్కులు పొందిన వారికి మాత్రమే పోస్టులు రానున్నాయి. ఎస్జీటీ పోస్టులు కొంతమేరకు ఉన్నా.. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కొన్ని సబ్జెక్టుల్లో కేవలం ఒకటి, రెండు మాత్రమే ఉన్నాయి. ఒక్కో ఉపాధ్యాయ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలను రోస్టరు పాయింట్లు, రిజర్వేషన్ల ఆధారంగా భర్తీ చేయనున్నారు. ఎంపికైన అభ్యర్థుల చరవాణి నంబరుకు ఎస్ఎంఎస్ లేదా మెయిల్ ఐడీకి మెయిల్ ద్వారా సమాచారం అందించనున్నారు. ఎంపికైన అభ్యర్థుల్లో ధ్రువపత్రాల పరిశీలనకు ఏ తేదీన హాజరు కావాలో సమాచారం ఇవ్వనున్నారు. డీఈవోల అధికారిక వెబ్‌సైట్లలో కూడా 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అందుబాటులో ఉంచుతున్నారు. అక్టోబరు 2 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ఇస్తున్నారు. పాఠశాలలు సెలవుల తర్వాత 15న ప్రారంభం కానున్నాయి. సెలవుల్లోనే ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. సెలవుల తర్వాత పాఠశాలల్లో కొత్త ఉపాధ్యాయులు పాఠాలు బోధించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 2వేల మంది ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పించడంతో చాలా చోట ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయనుండటంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనుంది. విద్యావ్యవస్థ గాడినపడనుంది.



విద్య శాఖ సంచాలకుల ఆదేశాలను నమోదు చేసుకుంటున్న డీఈవో రవీందర్, అధికారులు

జిల్లాల వారీగా ఇలా పోటీ

మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్జీటీ విభాగంలో 105 పోస్టులు స్థానిక సంస్థల పాఠశాలల్లో ఉండగా 2,979 మంది పరీక్ష రాశారు. స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రానికి 7 పోస్టులు ఉంటే 763 మంది పరీక్ష రాశారు. ఎస్జీటీలో తుప్పలి శివసాయి అనే అభ్యర్థి 84 మార్కులు తెచ్చుకొని జిల్లాలోనే ప్రథమ ర్యాంకు సాధించాడు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 111 ఎస్జీటీ పోస్టులకు 3,418 (ఒక్కోదానికి 31) మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. సౌమ్య ఎస్జీటీ ఫలితాల్లో 84.90 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు. నారాయణపేట జిల్లాలో తెలుగు విభాగంలో 127 ఎస్జీటీ పోస్టులకు 2,608 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ప్రియాంక 87.37 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకును సాధించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎస్జీటీ విభాగంలో అత్యధిక మార్కులు ఇవే కావటం విశేషం. జోగులాంబ గద్వాల జిల్లాలో తెలుగు మాధ్యమంలో 60 పోస్టులకు 2,694 మంది పరీక్ష రాశారు.

ఉమ్మడి జిల్లాలో పోస్టులు, అభ్యర్థుల పరిస్థితి..

జిల్లా	మొత్తం అభ్యర్థులు	మొత్తం పోస్టులు	1:3 అభ్యర్థులు
నాగర్‌కర్నూల్	10,072	285	855
మహబూబ్‌నగర్	7,521	243	729
నారాయణపేట	5,972	279	837
గద్వాల	6,474	172	516
వనపర్తి	2,137	152	456

1:3 నిష్పత్తి: డీఎస్సీ ఫలితాలలో అర్హత సాధించిన అభ్యర్థులకు 1 : 3 నిష్పత్తి ప్రకారం ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం నుంచి ఐదోతేదీ వరకు జరుగుతుందని డీఈవో అబ్దుల్ ఘనీ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు చరవాణి, మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చామన్నారు. అందుకున్న అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్దకు హాజరు కావాలన్నారు. 1 నుంచి 5వ వరకు స్కూల్ అసిస్టెంట్, 2 నుంచి 5 వరకు సెకెండరీగ్రేడ్, పీఈటీలు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

తనిఖీ చేస్తూ.. విద్యార్థులతో సంభాషిస్తూ..

పేట గురుకులంలో కలెక్టరు రాత్రి బస

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : పదో తరగతిలో పది జీపీఏ సాధించే విధంగా ఇప్పటి నుంచి పట్టుదలతో చదవాలని విద్యార్థులకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ హితవు పలికారు. నారాయణపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం రాత్రి బస చేశారు. రాత్రి 7 గంటల 45 నిమిషాలకు పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వంట గదికి వెళ్లి విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వంట సరకుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. కొత్త మెనూ బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కడే ఉన్న ఆర్వో ప్లాంటును పరిశీలించారు. తర్వాత విద్యార్థినులతో కలిసి రాత్రి భోజనం చేశారు. అదే పాఠశాల ఆవరణలో కేజీబీవీని తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. ఈ జిల్లా నుంచి ఇద్దరు కలెక్టర్లు ఉన్నారని, మీరూ కావాలని సూచించారు. కేజీబీవీలో వంటగది, నిల్వ ఉంచిన బియ్యం, మెనూ తదితర వాటిని పరిశీలించారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులతో మాట్లాడటంతోపాటు వారి పాటలను విని అభినందించారు. మళ్లీ గురుకులానికి వచ్చి చదువుకునే సమయాన్ని పరిశీలించారు. కొన్ని వాక్యాలు ఇచ్చి ఉపన్యసించమని విద్యార్థినులను కోరారు. డార్మిటరీకి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. రాత్రి గురుకుల పాఠశాలలోనే నిద్రించారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

తిరుమల లడ్డూ కల్తీ దోషులను శిక్షించాలి

నారాయణపేట, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూ కల్తీచేసిన దోషలను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్తు రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగడాకుల బాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం పేటలోని శక్తిపీఠం సన్నిధానంలో వీహెచ్‌పీ, హిందూ సంఘాల సమావేశం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా హిందూవులంతా చైతన్యం కావాలన్నారు. దేవాలయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శక్తిపీఠం నుంచి వీరసావర్కర్ చౌరస్తా వరకు చేరుకుని సావర్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. పోలీసులు ఐదుగురిని మాత్రమే లోపలికి అనుమతించడంతో వీహెచ్‌పీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు శాంతానందర్ పురోహింత్, శివ, నర్సిములు, డా. క్యాతన్ రఘునాథ్, డా. రాంబాబు, డా. మధన్‌మోహన్ రెడ్డి, శ్రావణ్ కుమార్, రాము, వెంకటేశ్, బాలకృష్ణ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రైతేరాజు 8 లో..

సీఎంను కలిసిన గ్రంథాలయ సంస్థ ఛైర్మన్

కోస్గి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయకుమార్ హైదరాబాద్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు సీఎం శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ తూము భీంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రఘువర్ధన్ రెడ్డి, అన్నకిష్టప్ప, నాగులపల్లి నరేందర్, బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, మాస్టర్ శ్రీనివాస్, ఇద్రిస్, భానునాయక్, కొడిగంటి హరి తదితరులు పాల్గొన్నారు.

దసరాకు 649 ప్రత్యేక బస్సులు

నేటి అందుబాటులోకి సర్వీసులు


మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : దసరా పండగ నేపథ్యంలో ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు 649 ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయించారు. నగరాల్లో స్థిరపడిన వారు దసరా పండగ కుటుంబ సభ్యులతో కలిసి చేసుకునేందుకు పల్లెలకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా హైదరాబాద్‌కు బస్సులు నడపనున్నారు. అచ్చంపేట-105, వనపర్తి-95, గద్వాల-89, మహబూబ్‌నగర్-69, కల్వకుర్తి-67, షాద్‌నగర్-59, కొల్లాపూర్-58, నారాయణపేట-54, నాగర్‌కర్నూల్-53 బస్సులను నడపనున్నట్లు ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో 25 శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు చెప్పారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట, కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, షాద్‌నగర్, కొత్తకోట, పెబ్బేరు, మక్తల్, కోస్గి, అయిజ, ఆమన్‌గల్, తెలకపల్లి, డిండి, బిజినేపల్లి, మద్దూర్, మరికల్, గణపూర్ బస్టాండ్ల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

తగ్గిన దిగుబడి.. పెరిగిన దిగుమతి

భారంగా మారిన ఉల్లి ధరల పెరుగుదల



దేవరకద్రలో ఉల్లిని విక్రయిస్తున్న రైతులు



న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం, దేవరకద్ర గ్రామీణం : ఏ కూర వండాలన్నా ఉల్లి ఉండాల్సిందే.. ఆ ఉల్లి ధరలే పెరిగిపోవటం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఇబ్బందికరంగా మారింది. గతేడాది ఉల్లి సాగు చేసిన రైతులు మార్కెట్లో సరైన ధరలు లేక తక్కువ ధరలకు అమ్ముకున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకున్న రైతులు ఈసారి పెద్దగా సాగు చేయలేకపోయారు. వర్షాలు ఆలస్యం కావటం కూడా ఇందుకు కారణం. ఫలితంగా ఉల్లిపంట కొరత ఏర్పడి ధర పెరిగిపోతోంది.

వర్షాలతో దెబ్బతిన్న పంట : వీపనగండ్ల, తిమ్మాజిపేట, వనపర్తి, పెబ్బేరు, ఊట్కూర్, నారాయణపేట, మక్తల్, నవాబుపేట, బాలానగర్, కల్వకుర్తి, ఊర్కొండపేట, మిడ్జిల్, బిజినేపల్లి, గండీడ్, మహమ్మదాబాద్ తదితర మండలాల్లో ఉల్లిని ఎక్కువగా సాగు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో 3,600 ఎకరాల్లో సాగయ్యే ఉల్లి పంట ఈసారి 1,200 ఎకరాలకు పడిపోయింది. ఇటీవలి వర్షాలతో ఉమ్మడి జిల్లాలో సాగు చేసిన కొద్దిపాటి ఉల్లిపంట కూడా దెబ్బతింది. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా ఉల్లి ధరలు పెరుగుతూ వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో వర్షాకాలంలో 52 ఎకరాలు, జోగులాంబ గద్వాల జిల్లాలో 87 ఎకరాల్లోపే ఉల్లి సాగైంది. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 2,800 ఎకరాల్లో ఉల్లి సాగయ్యేది. ఈసారి 971 ఎకరాల్లోపే సాగైంది. నారాయణపేట జిల్లాలో 340 ఎకరాలకు గాను 86 ఎకరాల్లో సాగైంది. వర్షాలతో పంట దెబ్బతినటంతో కర్నూలు, నందికొట్కూరు, మంత్రాలయం, అనంతపురం వంటి ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు ఉల్లి రాలేదు. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు మహారాష్ట్రలోని నాసిక్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవటంతో ధర మూడింతలు పెరిగింది. క్వింటా ఉల్లి ధర జులైలో రూ.2,000 ఉండగా.. సెప్టెంబరులో రూ.5,600లకు పెరిగింది. కిలో ఉల్లి ధర జులైలో రూ.15 నుంచి రూ.20 ఉండగా.. ఇప్పుడు రూ.60కి పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా ఉద్యాన అధికారి కె.వేణుగోపాల్‌ని 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగు తగ్గటం, వర్షాలతో పంట దెబ్బతినటమే ధరల పెరుగుదలకు కారణమన్నారు. యాసంగిలో పంట సాగు పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.



భారంగా మారింది.. : ఏ కూర వండలన్నా ఉల్లి తప్పనిసరి. పెరిగిన ఉల్లి ధరలు మాకు భారంగా మారాయి. వారానికి 3 కిలోల వరకు ఉల్లి వినియోగిస్తాం. పెరిగిన ఉల్లి ధరలతో కొనుగోలు చేయలేకపోతున్నాం. ఉల్లి ధరలను నియంత్రించి సామాన్యులకు అందుబాటులో ఉంచాలి.

- సంధ్యారాణి, మహిళ, గూరకొండ




రైతుకు లాభం లేదు.. : మార్కెట్‌లో ఉల్లి కిలో రూ.60కి విక్రయిస్తున్నారు. రైతులు మార్కెట్‌కు పంట తీసుకెళ్తే క్వింటాకు రూ.2,500 నుంచి రూ.3,500 వరకే ఇస్తున్నారు. పేరుకే ఒకరిద్దరు రైతులకు రూ.5వేల చొప్పున చెల్లిస్తున్నారు. పెరిగిన ధర రైతులకు కూడా చెల్లించాలి.

- భగవంతు, రైతు, దేవరకద్ర

ఆకుకూర.. తనివితీరా!

● చవగ్గా అందుబాటులో పోషకాహారం
● నేడు శాకాహార దినోత్సవం



పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లలో కొవ్వులేక పోవడం వలన గుండె జబ్బులు దరిచేరవు. ఆకుకూరలు, కూరగాయల్లోని యాంటి ఆక్సిడెంట్లు క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాలు దరిచేరని వ్యవస్థ నిర్మాణం చెబుతున్నాయి. శాకాహారంలో ఆకుకూరలకు ప్రాధాన్యం ఉండటమే కాకుండా ఎలాంటి ఖర్చులేకుండా ఇంటి పరిసరాల్లోనూ పండించుకోవచ్చు. - న్యూస్‌టుడే, బిజినేపల్లి

తొలిసారి 1977లో.. పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడేదిశగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఏటా అక్టోబర్ 1న ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని జరుపుకొంటారు. తొలిసారి 1977లో అమెరికాలో నిర్వహించారు. శాకాహార ప్రాముఖ్యత, విలువలను ప్రపంచానికి వివరించేందుకు ఇష్టపడేవారు పండలాది సదస్సులను నిర్వహించారు.

అందుబాటులో ఆరోగ్యం: భారతదేశంలో అనాదిగా శాకాహారానికి ఉన్న ప్రాధాన్యం గొప్పది. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రకృతి ఇచ్చిన వరం ఆకుకూరలు. రోజూ ఏదో ఒక ఆకుకూరను ఆహారంలో తీసుకుంటే ఆరోగ్యం కోసం రూ. వేలు ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉండదు. జీవన శైలిని మార్చే సత్తా ఆకుకూరలకు ఉందని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటున్నారు. ఆకుకూరల్లో తక్కువ కొవ్వు ఉండటం, అధిక ప్రొటీన్లు, ఖనిజలవణాలు అధికం. పెరడు, ఇంటి మిద్దెపై ఖాళీ డబ్బాలు, కుండీలను వినియోగించి ఇంటికి కావాల్సిన తాజా ఆకుకూరలను పండించుకోవచ్చు.



తోటకూర: ఆకుకూరల్లో ఎక్కువమంది ఇష్టపడే తోటకూరలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలతో పాటు, అనేక పోషకాలున్నాయి. తోటకూరను ఆహారంగా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. క్యాన్సర్‌ని నిరోధిస్తుంది. త్వరగా జీర్ణమవడంతో పాటు, జలుబు, జ్వరం వంటి చిన్న రోగాలు బారిన పడకుండా కాపాడుతుంది. విత్తిన నాటి నుంచి 25 నుంచి 30 రోజుల్లోపు కోతకు వస్తుంది.

గోంగూర (పుంటి కూర): గోంగూరతో చాలా లాభాలున్నాయి. తినడానికి కాస్త పుల్లగా అనిపించినా.. గోంగూర తరుచూ తినడం వలన రక్తహీనత సమస్య దరిచేరదు. గుండెకు బలం చేకూరుతుంది. గోంగూరను బాగా ఉడకబెట్టి పుండ్లపై కడితే అవి త్వరగా మానుతాయి. గోంగూర నిల్వ పచ్చడిగా వినియోగించుకోవచ్చు. విత్తిన నాటి నుంచి 15 నుంచి 20 రోజుల్లోగా గోంగూర ఆకులను ఆహారంగా తీసుకోవచ్చు.



బచ్చలి కూర: బచ్చలికూర గ్రామాల్లో విరివిగా లభిస్తుంది. ఇది ఆహారంలో తరచూ వాడటం వలన ఒంట్లో వేడి తగ్గుతుంది. మూత్రంలో మంట, ఇన్‌ఫెక్షన్లపై ప్రభావం చూపుతుంది. బచ్చలి కూరను కుండీలు, ఇంటి ఆవరణలో సులభంగా పెంచుకోవచ్చు. నాటిన 30 నుంచి 35 రోజుల వ్యవధిలో కోతకు వస్తుంది.



పాల కూర: పాలకూరకు రక్తాన్ని శుద్ధి చేసే తత్వం ఉంటుంది. పాలకూరలో విటమిన్ సి, ఏ, మెగ్నీషియం, ఫోలిక్ యాసిడ్ వంటివి క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించడంలో తోడ్పడతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్లను అదుపుచేయడంలో పాలకూర ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ ఆకుకూర వాత, పిత్త, కఫ దోషాలను నివారిస్తుంది. విత్తనం నాటిన 20 -25 రోజుల నుంచి పాలకూరను ఆహారంగా వినియోగించవచ్చు.



కంటి చూపునకు పొన్నగంటి కూర: పొన్నగంటి కూర శరీరానికి చలువ చేస్తుంది. కంటి చూపు సమస్యతో బాధ పడేవారికి పొన్నగంటి కూర చాలా మేలు చేస్తుంది. నిత్యం ఆహారంలో తీసుకోవడం వలన కంటి చూపు మెరుగుపడుతుంది. పొన్నగంటి కూర సహజసిద్ధంగా పొలం గట్లపై వర్షాకాలంలో లభిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం ఇలా..

జిల్లా	కూరగాయల సాగు	ఉత్పత్తి (సుమారు టన్నుల్లో)
నారాయణపేట	2,217	26,075
మహబూబ్‌నగర్	1,986	18,795
జోగులాంబ గద్వాల	4,585	52,350
నాగర్‌కర్నూల్	1,890	20,892
వనపర్తి	1,719	19,780

పెరట్లోనే కూరగాయలు..: 30 ఏళ్లుగా పెరటి తోటల పెంపకం ద్వారానే కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాను. నిత్యం తీసుకునే ఆహారంలో ఏదో ఒక ఆకుకూర తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తవు. ఇంటి బయట ఖాళీ స్థలం లేని వారు, మిద్దెపై కుండీల్లోనూ కూరగాయలు, ఆకుకూరలు సాగుచేసుకోవచ్చు. - శారద, విశ్రాంత ఉపాధ్యాయిని, పాలెం



పెరటితోట సాగులో విశ్రాంత ఉపాధ్యాయురాలు శారద


అందుబాటులో అధిక పోషకాలు..: సహజసిద్ధంగా పంట పొలాల్లో పెరిగే జొన్నచెంచలి, గోగ్గలి, ఎల్లచెవుటకూర, తగరింత, పాయలాకు, తెల్లిలా, గుప్పరేణి, గునుగు, తుమ్మి, పొన్నగంటి, నల్లకాశ, తెల్లకాశ, బుడ్డకాశ, గోరుమడి, సన్నపాయల, తెల్లగలిజ్జం, చెన్నంగి, యెన్నాద్రి, అవిసి నోము కూర, చిత్రమాళ, అంగిబింగి, అడవి పుల్లకూర, బంకిలి పూరి, నల్లచేల ఉసిరి, ముల్లుదోగ్గలి, పులపత్తం, గంగవాయిలి వంటి సహజంగా లభించే ఆకుకూరలను ప్రజలు ఆహారంగా తీసుకోవడం లేదు. వాణిజ్యంగా సాగు చేసిన ఆకుకూరలతో పోల్చితే వీటిలో అధిక మొత్తంలో సూక్ష్మ పోషకాలు, ప్రొటీన్లు ఉన్నాయి. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ, కేవీకే ఆధ్వర్యంలో ప్రకృతిలో లభించే ఆకుకూరలపై అవగాహన కల్పిస్తున్నాం.



- హేమలత, గృహ విజ్ఞానశాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, జహీరాబాద్

పొగాకు నారు మడి.. అధిక రాబడి

మల్దకల్, న్యూస్‌టుడే : సంప్రదాయ పంటలు సాగుచేసి ఆశించిన స్థాయిలో దిగుబడి దక్కక, గిట్టుబాటు ధరలు లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఓ రైతు మిత్రుడి సలహాతో పొగాకు నారు సాగు చేసి లాభాల బాటలో పయనిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంటకు చెందిన పెద్ద తిమ్మోతి 30 గుంటల్లో పొగాకు నారు పెంపకం చేపట్టారు. పొడవు 40 అడుగులు, వెడల్పు మూడు అడుగుల ప్రకారం 150 బెడ్లు ఏర్పాటు చేసుకుని జులై చివరి వారంలో విత్తనాలు చల్లారు. అంతకు ముందు పొలంలో రెండు ట్రాక్టర్ల పశువుల ఎరువుతో పాటు సేంద్రియ ఎరువు వేసి కలియదున్నారు. బిందు సేద్యం పరికరాలతో నీటితడులు అందించారు.



నారుమడిలో కలుపు తీస్తున్న రైతు పెద్దతిమ్మోతి

55 నుంచి 60 రోజుల వరకు పొలంలో నాటడానికి అనుకూలంగా ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఇక్కడికే వచ్చి నారు తీసుకెళ్తున్నారు. బెడ్ల తయారీ, ఎరువులు, కూలీలు, ఇతరత్రా అవసరాలకు రూ.1.10 లక్షల వరకు ఖర్చయినట్లు రైతు తెలిపారు. 120 బెడ్ల నారు విక్రయించగా రూ.2.50 లక్షలు వచ్చాయన్నారు. రూ.1.40 లక్షలు ఆదాయం పొందినట్లు పేర్కొన్నారు. ఇంకా 30 బెడ్ల నారు ఉందని తెలిపారు.

పొలం వద్దే కొనుగోళ్లు: పొగాకు బెడ్లలో కలుపు నివారణ కూలీల అవసరం. కలుపు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నా. కర్ణాటకతో పాటు గట్టు, ఇటిక్యాల, గద్వాల మండలాలకు చెందిన రైతులు పొలం వద్దకే వచ్చి నారు కొనుగోలు చేస్తున్నారు. ఆరేళ్లుగా నారు పెంచి విక్రయిస్తున్నా. ఈఏడాది అనుకూలంగా వర్షాలు కురిశాయి. మంచి గిరాకీతో పాటు ధర అధికంగా పలికి లాభాలు వచ్చాయి. - పెద్దతిమ్మోతి రైతు, తాటికుంట, మల్దకల్‌మండలం

రైతేరాజు

ప్రశ్నలు - సమాధానాలు

? వరి ఆకునల్లి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? - కృష్ణయ్య, దంతనూర్

✔ గంధకం 3 గ్రాములు లేదా ఫాపర్‌గేట్ 2 మి.లీ లేదా స్పైరోమెసిఫెన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో సూదిపురుగు (పిన్‌వార్మ్) నివారణకు చర్యలు తెలపండి. - రామకృష్ణ, మున్ననూర్

✔ లీటరు నీటిలో ఇండాక్సీకార్బ్ 1.75 మి.లీ లేదా సైనోశాడ్ 0.3 మి.లీ లేదా డెల్టామిత్రిన్ 1 మి.లీ లేదా ల్యామ్డా సైహలోత్రిన్ 1 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

? కందిలో మారుక గూడుపురుగు నివారణకు ఎలాంటి మందులు వాడాలి? - స్వామి, చెన్నారం

✔ నివారణకు వేపమందు (1500పీపీఎం) 5 మి.లీ, న్యూవులురాన్ 1 మి.లీ లేదా క్లోరాంత్రీనిఫోల్ 0.3 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం
- న్యూస్‌టుడే, మదనాపురం

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

వేరుసెనగలో సస్యరక్షణ పాటిస్తే దిగుబడులు

మదనాపురం, న్యూస్‌టుడే : యాసంగిలో సాగుచేసే వేరుసెనగలో కలుపు, చీడపీడల నివారణకు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరితాంధ్ర, ధరణి, జేల్ 24, జగిత్యాల పల్లీ 1, టీసీజీఎస్ 1694 అనువైన రకాలని పేర్కొన్నారు.



సాగు చేసిన వేరుసెనగ

విత్తనశుద్ధి : విత్తనాన్ని టెబ్యూకోనోజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి మొదట చేసుకుని ఆపైన ట్రైకోడర్మా 10 గ్రాములు, రైజోబియం 5 గ్రాములు విత్తనం వేసే 2 గంటల ముందు కలుపుకొని విత్తుకోవాలి.

పోషకాల యాజమాన్యం : భాస్వరం, పొటాష్ ఎరువులు విత్తే సమయంలోనే వేయాలి. ఎకరానికి 100 కిలోల సూపర్‌ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేయాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా వేసుకోవాలి.

కలుపు నివారణకు..: విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపల కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరును ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి నేలపై పిచికారీ చేసుకోవాలి. గడ్డిజాతి మొక్కలు అధికంగా ఉంటే క్విజలోఫాప్.పి.ఇథైల్ ఎకరాకు 400 మి.లీ లేదా ప్రోపాక్విజఫాస్.పి.ఇథైల్ ఎకరాకు 250 మి.లీ విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవచ్చు.

చీడపీడల యాజమాన్యం : రసం పీల్చే పురుగు నివారణకు ఫ్రిపోనిల్ 2 మి.లీ లేదా థయోమిదాక్సామ్ 0.4 గ్రాములు లేదా ఇమిడాక్లోఫిడ్ 0.3 మి.లీ లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటిదశలో 5 మి.లీ వేపమందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోఫైరిఫాస్ 50ఈసీ 1.5 మి.లీ లేదా న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లేదా ఎసిపేట్ 1.5 గ్రాముల మందు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మంత్రులకు దసరా ఉత్సవాల ఆహ్వానం



మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వానం పలుకుతున్న ఈవో పురేందర్, అర్చకుడు ఆనంద్‌శర్మ

అలంపూర్, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు అలంపూర్ ఆలయాల్లో ఉత్సవాలకు హాజరవ్వాలని మంత్రులకు ఆహ్వానం పలికారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మంత్రులు రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణకు ఈవో పురేందర్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆహ్వాన పత్రికలను అందజేశారు.

పాలమూరు క్రికెట్ జట్టు హ్యాట్రిక్

అర్ధ శతకాలు సాధించిన అభిలాష్, అబ్దుల్ రాఫె, షాదాబ్

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 రాష్ట్రస్థాయి వన్డే టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు మెదక్‌పై గెలుపొంది హ్యాట్రిక్ సాధించింది. సోమవారం హన్మకొండలో నిర్వహించిన మూడో వన్డేలో మెదక్‌పై 90 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి జిల్లా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసింది. ముగ్గురు అర్ధ శతకాలతో ఆకట్టుకున్నారు. అభిలాష్ 66, అబ్దుల్ రాఫె 54, షాదాబ్ అహ్మద్ 53 పరుగులు చేశారు. అనంతరం లక్ష్య ఛేదనకు బరిలోకి దిగిన మెదక్ జట్టు 32.1 ఓవర్లలో 127 పరుగులకే కుప్పకూలింది. జిల్లా జట్టు నుంచి షాదాబ్ 4, అంకిత్ రాయ్, ముఖీత్ చెరో 2 వికెట్లు తీశారు. విజయం సాధించిన పాలమూరు జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు



వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 226 మంది చదువుకుంటున్నారు. వీరిలో 110 మంది విద్యార్థినులున్నారు. అందరికీ కలిపి పాఠశాల ఆవరణలో ఒక యూనిట్ మూత్రశాల మాత్రమే ఉంది. విద్యార్థినులు నిత్యం ఇలా బారులుదీరి నిరీక్షిస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి అసౌకర్యాలతో చదువుపైనా శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. 116 మంది బాలురు ఆరుబయటకు వెళ్లాల్సిందే. 'మన ఊరు-మన బడి'లో మరో యూనిట్ మూత్రశాల మంజూరైనా నిర్మాణం చేపట్టలేదు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల బదిలీపై వచ్చానని, సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. - న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం

విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీరు

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టు వద్ద 68 వేల క్యూసెక్కుల వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుదుత్పత్తికి 37,115 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.151, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4.526 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత వర్షాకాలంలో ఎగువన 121.716, దిగువన 186.736 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

బతుకమ్మ పాఠం.. చరిత్రకు అద్దం



బతుకమ్మలతో మహిళలు

కొత్తకోట, న్యూస్‌టుడే : తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేది బతుకమ్మ పండగ. ఇది దేశంలో అరుదైన పూల పండగ. ఏళ్ల క్రితమే మరుగున పడిన ఈ వేడుక.. రాష్ట్రం ఆవిర్భావం అనంతరం పూర్వ వైభవం సంతరించుకుంది. తొమ్మిది రోజుల పాటు మహిళలు ఎంతో ఇష్టంగా జరుపుకొంటారు. ప్రకృతిని ఆరాధిస్తూ సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పండగ విశిష్టతను విద్యార్థి దశలోనే తెలిసేలా పాఠ్య పుస్తకాల్లో వీటిని చక్కగా వివరించారు. బుధవారం నుంచి జరుపుకొనే ఈ పండగ విశేషాలపై పాఠ్యపుస్తకాల్లో ఉన్న అంశాలపై 'న్యూస్‌టుడే' కథనం..

ఇది కథ..

బతుకమ్మ గురించి ఏడో తరగతి ఉపవాచకంలో 'మన పండగలు' పాఠ్యాంశంలో చక్కగా వివరించారు. 'చోళరాజు అయిన ధర్మాంగదునికి వందమంది కుమారులు సంతానం. వారంతా యుద్ధంలో మృతి చెందుతారు. చాలా కాలం తరువాత లక్ష్మీదేవి అనుగ్రహంతో ఓ ఆడపిల్ల పుడుతుంది. ఈ పాపకు బతుకమ్మ అని పేరు పెట్టి నిండానూరేళ్లు బతకాలని అందరూ ఆశీర్వదిస్తారు'. ఆ అమ్మాయే బతుకమ్మగా పూజలందుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో దొరికే గునుగు చామంతి, తోక చామంతి. తంగేడు, కట్ల, పిట్టకాలి, ఎర్రగన్నేరు, రుద్రాక్ష, బీర గుమ్మడి, ముద్దబంతి వంటి రంగురంగుల పూలు సేకరించి చక్కగా పేర్చి పైన పసుపు ముద్దను నిలిపి గౌరీదేవిగా కొలుస్తారు. ప్రతి రోజూ సాయంత్రం ఆడుకొని చెరువులో నిమజ్జనం చేస్తారు.

రోజుకో తీరు..

తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లతో బతుకమ్మను పిలిచి కొలుస్తారు. తొమ్మిది రకాల ఫలాలు సమర్పిస్తారు. ప్రతి రోజు ప్రత్యేకంగా ఫలహారం నైవేద్యంగా పెడతారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, ఐదో రోజు అట్ల బతుకమ్మను కొలుస్తారు. ఆరో రోజును అర్రెమి అంటారు. ఎవరి ఇళ్ల వద్ద వారే ఆటలాడుకుంటారు. ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మగా పిలుస్తారు.

సద్దుల బతుకమ్మ ప్రత్యేకం

తొమ్మిదో రోజు దసరాకు ఒకటి, రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మను జరుపుకొంటారు. ఆరోజు కుటుంబ సభ్యులంతా ఇంట్లో ఉంటారు. బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటారు. కొత్త దుస్తులు ధరిస్తారు. ఆడబిడ్డలను, బంధువులను పిలుచుకుంటారు. బతుకమ్మను ఎత్తుకొని సద్దులు తీసుకుని ఆడుకున్న తరువాత చెరువుకు వెళ్తారు. జొన్న, మక్క పిండి, బెల్లం, పెసరపిండి, నెయ్యితో చేసిన పదార్థాలు, సత్తుపిండి, దోసకాయ, పెసరపప్పు, బెల్లంతో సద్దులు తయారు చేస్తారు. చెరువు వద్ద బతుకమ్మలను దించి మరోసారి ఆడుకుని చెరువులోకి సాగనంపుతారు. అనంతరం తెచ్చిన సద్దులను ఒకరినొకరు పంచుకుంటారు.

ఆట, పాటల్లో సాహిత్యం

'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ అమ్మలక్కలు, ఆడపడుచులు ఎంతో ఇష్టంగా ఆటపాటలు లయబద్ధంగా ఆడి పాడుతుంటారు. ప్రతి పాటలోనూ గౌరమ్మనే ఆరాధిస్తారు. ఇందులో గొప్ప సాహిత్యం ఉంటుంది. ఎక్కువగా ఆడపిల్లల జీవితాలు, కష్టాలు, అత్తవారింట్లో ఎదుర్కొనే సమస్యలు పాటల రూపంలో బయటకు వస్తుంటాయి.

సంస్కృతి చాటి చెప్పేలా..

పాఠ్యపుస్తకాల్లో సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా పాఠ్యాంశాలు ఎంతో అవసరం. వీటి వల్ల పాఠశాల దశలోనే విద్యార్థికి మన చరిత్ర తెలుస్తుంది. పండగ అంటే ఏదో కుటుంబ సభ్యులంతా కలిసి మంచి భోజనం చేయడం కాదని అందులో విశేషం ఉందని గ్రహిస్తారు. ఇలాంటి పాఠ్యాంశాలు నేటి తరానికి ఎంతో అవసరం.

- కోట్ల వనజాత, రచయిత్రి, మహబూబ్‌నగర్

అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగు



చెన్నప్పోళ్ల జయమ్మ

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ మహిళ గత వారం రోజులుగా మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచే సమయంలో అవయవదానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు నింపింది. మక్తల్ శివాజీనగర్‌కు చెందిన చాకలి జయమ్మ గత మంగళవారం మాగనూరు మండలంలోని నల్లగట్టు మారెమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకునేందుకు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. ఆలయం వద్ద బస్సు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో తలకు తీవ్ర గాయమయ్యింది. వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయ్యిందని అక్కడి వైద్యులు చెప్పారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు జయమ్మ భర్త లక్ష్మణ్, కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అంగీకరించారు. సరోజిని కంట ఆస్పత్రికి ఒకరికి కళ్లు అమర్చగా, పదోతరగతి విద్యార్థికి కిడ్నీ అమర్చారు. ఇతర అవయవాలు మరికొందరికి అమర్చుతామని ఆస్పత్రి వైద్యులు చెప్పారు. జయమ్మ మృతదేహాన్ని సోమవారం మక్తల్ తీసుకొచ్చారు. పట్టణ ప్రజలు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తూ ఇంటి వరకు ఊరేగింపుగా మృతదేహంతోపాటు వెళ్లారు.

చోరీ కేసుల్లో నిందితులకు రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానందం, ముసుగులో నిందితులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : కొన్ని రోజులుగా జడ్చర్ల పట్టణంలోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను జడ్చర్ల పోలీసులు సోమవారం పట్టుకుని రిమాండుకు తరలించారు. సీఐ ఆదిరెడ్డి, ఎస్సై శివానంద్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జడ్చర్ల పట్టణంలోని ఎర్రగుట్ట వద్ద నివాసముండే చిట్యాల రవి, వేంకటేశ్వర కాలనీలో ఉండే లింగాల మహేశ్ కలిసి తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తూ వాటిలో చోరీలకు పాల్పడుతున్నారు. వీరు జులై 30న పట్టణంలోని భవానీనగర్‌లోని వడ్ల గోపి, ఆగస్టు 19న మమతనగర్ సమీపంలో నరేంద్రసాగర్, గత నెల 14న తాలుకా క్లబ్ రోడ్డులోని హసల్ అలీలకు చెందిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డారు. తాలుకా క్లబ్ రోడ్డులోని సీసీ కెమెరాల పుటేజీలో నిందితులు ఉన్నాయి. వారిని పట్టుకుని విచారించగా చోరీలు చేశామని ఒప్పుకొన్నారు. వారి నుంచి మూడు తులాల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. నగదు మాత్రం లభించలేదు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో చొరవ చూపిన పోలీసు సిబ్బంది నర్సింహ, విష్ణులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	110-00
రిటైల్	132-00
డ్రెస్డ్	191-00
స్కిన్‌లెస్	218-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836

తెరపై ఈనాడు

దేవర: వనయాంబ(కోస్గి), వెంకటరమణ(మక్తల్), మనోహర్ (నారాయణపేట), **సత్యం సుందరం:** మహేశ్వరి(నారాయణపేట)

- న్యూస్‌టుడే, పాతబస్టాండ్, మక్తల్ రూరల్

కూరగాయల ధరలు(కిలోకు)



నారాయణపేట (పాతబస్టాండ్) న్యూస్‌టుడే : టమాటా రూ.50, వంకాయలు రూ.50, ముళ్ల వంకాయలు రూ60, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.70, బెండకాయలు రూ.50, బీరకాయలు రూ.70, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.40, చిక్కుడు రూ.60, పెద్ద చిక్కుడు రూ.90, గోకరకాయ రూ.70, క్యాప్సికం 70, బీన్స్90, క్యాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60. క్యాబేజీ రూ.40, ఉల్లి రూ.70, చింతపండు రూ.120.

ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపిక

ధన్వాడ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ జట్ల ఎంపికల్ని ఎస్‌జీఎఫ్ అధికారులు పూర్తి చేశారు. 14 ఏళ్లలోపు బాలికల విభాగంలో 30 నుంచి 62 కిలోల బరువు పరిధిలో నందిని, నిఖిత, సీతామహాలక్ష్మి, శిరీష, ప్రియమణి, మౌనిక, గంగమ్మ, కీర్తి ఎంపికయ్యారు. 17 ఏళ్ల విభాగంలో నేహశ్రీ, శిరీష, జె.శిరీష, బాలమణి, జగదీశ్వరి, శివరంజని, సఫేరా, సోనమ్మలు ఉన్నారు. 19 ఏళ్ల విభాగానికి సంబంధించి 50 నుంచి 53 కిలోల బరువు పరిధిలో గీతా, రజిత, గీత, సాయి వైష్ణవి ఎంపికయ్యారు. బాలర 14 ఏళ్ల విభాగంలో 35 నుంచి 68 కిలోల పరిధిలో అఖిల్, రాకేష్, కుమార్, ప్రవీణ్, నరేందర్, జగన్ నాయక్, రోషన్, అరవింద్ వెంకటేష్‌లు ఎంపిక కాగా 17 ఏళ్ల విభాగంలో భాను, రాజేష్, నందు, మధు, మహేష్, ప్రవీణ్‌నాయక్. గిరి ఎంపికయ్యారు. 19 ఏళ్ల విభాగంలో జె. అరుణ్, చరణ్‌నాయక్, పవన్, ముకుందలు ఎంపికయ్యారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కొండదొడ్డిలో రాయితీ గ్యాస్ సిలిండర్ ధ్రువపత్రాలు అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గణేశ్‌కుమార్

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గణేశ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొండదొడ్డి గ్రామంలో రాయితీ గ్యాస్ సిలిండర్‌ల దస్త్రాలను అందించి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ రామేశ్వరమ్మ, ప్రత్యేకాధికారి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, శేఖర్, ధనుంజయ, పంచాయతీ కార్యదర్శి కురుమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



భరతనాట్యం చేస్తున్న బాలిక

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : యువతల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జాతీయ యువజనోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో పేటలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కలెక్టరు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారుల భరతనాట్య ప్రదర్శనను తిలకించి అభినందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయికి పంపిస్తామని డీవైఎస్‌వో అన్నారు. డీఈవో అబ్దుల్ ఘనీ, జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్, ఉపాధ్యాయ సంఘాల నేతలు, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మారథాన్‌లో పతకం



పతకం సాధించిన ఐజీ ఎం.రమేశ్‌రెడ్డి

అమరచింత, న్యూస్‌టుడే : జర్మనీ దేశంలోని బెర్లిన్ నగరంలో సెప్టెంబరు 29న నిర్వహించిన 5, 10 కి.మీ. మారథాన్ పోటీల్లో తెలంగాణ పోలీస్ అకాడమి నుంచి మండలంలోని మస్తీపూర్ గ్రామానికి చెందిన ఐజీ ఎం.రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు. 161 దేశాల నుంచి 58,212 మంది పోటీల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు 10 మందిని పతకాలకు ఎంపిక చేయగా.. అందులో ఐజీ రమేశ్‌రెడ్డి ఉన్నారు. ఈయన పతకం సాధించడంతో గ్రామ యువకులు సంబరాలు చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక



షూటింగ్‌బాల్ బాలికల జిల్లా జట్టు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు పతకాలు అందించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలురు, బాలికల జట్లు అక్టోబరు 3 నుంచి 5వరకు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఆకు కదిలినా.. ఆకాశంలో ఉరిమినా
విద్యుత్తు కట్‌కటా

పల్లె నాటి విద్యుత్తు స్తంభాలు, తుప్పుపట్టిన తీగలు, నియంత్రికలతో జిల్లాలో సరఫరా అస్తవ్యస్తంగా తయారయ్యింది. గాలి వీచినా, చినుకు పడినా, మెరుపు మెరిసినా గ్రామాల్లో గంటల తరబడి సరఫరా నిలిచిపోతోంది. ప్రజలు చిమ్మచీకట్లతో నానా అవస్థలు పడుతున్నారు. దోమల రొద, ప్రమాదాలకు కోతలు కారణమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 'న్యూస్‌టుడే' బృందం పరిశీలించినప్పుడు ఎన్నో సమస్యలు వెలుగు చూశాయి. - న్యూస్‌టుడే, బృందం



కారాత్రిని తలపిస్తున్న ఈ చిత్రం ధన్వాడ మండలం రాంకిష్టాయపల్లిలోనిది. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా మండే వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు గాలివీచినా, చిన్న చినుకుపడినా సరఫరా నిలిచిపోతోంది. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఐదేళ్ల కిందట వేసిన వర్షాలతో గ్రామంలోని రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. ఇళ్ల పరిసరాల్లో పిచ్చిగడ్డి, పొదలు విస్తరించాయి. విషపురుగుల భయం వెంటాడుతున్న తరుణంలోనే విద్యుత్తు ఇబ్బందులు ఎదురవుతుండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంసాన్‌పల్లి, ఏమ్నోన్‌పల్లి, మంత్రోనిపల్లి, హన్మన్ పల్లి, చర్లపల్లి గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గిరిజన తండాల్లో అయితే చినుకులు, ఈదురుగాలులతో పరిస్థితి మరీఘోరం.



ఊట్కూరు మండలం కొత్తపల్లి, పెద్దపొర్ల, తిమ్మారెడ్డిపల్లి తండా, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసిందంటే విద్యుత్తు సరఫరా రోజుల తరబడి నిలిచిపోతోంది. లైన్‌మెన్లు అందుబాటులో ఉండటం లేదని, పంచాయతీ సిబ్బందే మరమ్మతులకు దిక్కవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉండటంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోతే దోమలకు బలికావాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపొర్లలో మరమ్మతుకు గురైన నియంత్రికను చిత్రంలో చూడొచ్చు.

పరిశీలన



ప్రకృతిపరంగా చిన్న మార్పు వస్తే చాలు మాగనూరు, కృష్ణా మండలాల్లో ఉప కేంద్రాలున్న గ్రామాలలో మాత్రమే సరఫరా ఉంటోంది. గురురావు లింగంపల్లి, కొత్తపలి, ఆలంపల్లి, ఖాన్‌దొడ్డి గ్రామాల ప్రజలు చీకట్లో గడపాల్సి వస్తోంది. విద్యుత్ లైన్‌లలో ఉన్న సమస్యలు పట్టించుకోక పోవడం వల్లనే ఈ సమస్య తలెత్తుతోంది. పాత విద్యుత్తు లైన్లకు ఏర్పాటు చేసిన పింగాణీ ఇన్సులేటర్లకు లీకేజీలు ఏర్పడి సమస్య తలెత్తుతోంది.




బొందల్‌కుంట, జక్లేర్, సామన్‌పల్లి, మాదన్‌పల్లి గ్రామాల్లో చిన్నపాటి గాలి వానకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ముష్టిపల్లి ఉపకేంద్రం పరిధిలో సత్యవార్, కొండదొడ్డిల్లో ఈ సమస్య ఉంది. విద్యుత్తు లైన్లు సక్రమంగా లేకపోవడంతో చిరుజల్లులు, చిన్నపాటి గాలికి సరఫరా నిలిచిపోతుంది. కొండదొడ్డిలో లో వోల్టేజీ సమస్య కూడా ఉంది. నియంత్రిక వద్ద తరచూ ఫీజులు ఎగిరిపోతుంటాయి.


● కోస్గి పట్టణంలో కొన్ని ప్రాంతాలు, మండలంలో గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతే సింగిల్‌ఫేస్ సరఫరా చేస్తున్నారు. త్రీ ఫేజ్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పాయపల్లిలో విద్యుత్తు తీగలపై చెట్ల కొమ్మలు పడుతుంటాయి.

● దామరగిద్ద మండలం లింగారెడ్డిపల్లి, పిడ్డెంపల్లి గ్రామాల్లో విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. ఎప్పుడు కరెంట్ ఉంటుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ఫోన్‌చేసి అడిగితే విద్యుత్తుశాఖ అధికారులు తెలియదంటున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

అంతరాయాలు సవరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు



న్యూస్‌టుడే, మాగనూరు: గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్తు సరఫరా అంతరాయాలను సవరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. సమస్యను త్వరితగతిన గుర్తించడానికి అవసరం ఉన్నచోట్ల ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. లైన్ల పక్కన ఉన్న చెట్లను తొలగించాం. ఇంకా సమస్య ఉంటే చెప్పవచ్చు..పాత కాలపు పింగాణీ ఇన్సులేటర్ల వల్ల వర్షం చినుకులు పడి సరఫరా నిలిచిపోతోంది. వాటిని పరిశీలించి మార్చుతాం. ఉప కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించాలని ఎంఆర్టీ సిబ్బందిని ఆదేశించాను. సమస్యలను గుర్తించి పరిష్కరించాలని లైన్‌మెన్లను ఆదేశించాను. **- ప్రభాకర్, విద్యుత్తుశాఖ ఎస్ఈ, నారాయణపేట**



మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో 14వేల విద్యుత్తు కనెక్షన్లకు ప్రతి నెలా రూ.75లక్షల బిల్లులు వసులు అవుతున్నాయి. నాణ్యమైన విద్యుత్తు మాత్రం అందడం లేదు. కాలం చెల్లిన స్తంభాలు, తీగలు, నియంత్రికలతో ఇబ్బందులు తప్పటం లేదు. కొత్త కాలనీలకు కర్రలపై తీగలు ఏర్పాటు చేసుకొని సరఫరాను కొనసాగిస్తున్నారు. రెనివట్ల, పర్సపూర్, భూనీడ్, మద్దూరు, చింతల్‌దిన్నే. జాదరావుపల్లి గ్రామాల్లో విద్యుత్తు నియంత్రికలు గ్రామ మధ్యలో ప్రమాదకరంగా ఉన్నాయి. పర్సపూర్‌లో నియంత్రికను చిత్రంలో చూడొచ్చు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి



సంస్మరణ సభలో మాట్లాడుతున్న టి.సాగర్

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : వామపక్ష యోధుడు సీతారాం ఏచూరి అకాల మరణం ఉద్యమాలతోపాటు దేశానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.సాగర్ అన్నారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన ఏచూరి సంస్మరణ సభలో పాల్గొని మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను అవగాహన చేసుకొని దేశ సమస్యలకు పరిష్కారం చూపిన గొప్ప నేత అని కొనియాడారు. సిద్ధాంతంపై పట్టు, బహుభాషా కోవిదుడిగా దేశం మొత్తం ఆయన సేవలు వినియోగించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజుల ఆశిరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, పుంజనూరు అంజనేయులు, బలరాం, గోవిందరాజు, భరత్‌కుమార్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం పొందడం అందరి హక్కు



కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం నారాయణపేటలో స.హ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ పౌరులందరూ చట్టం ప్రకారం సమాచారం పొందే హక్కు ఉందన్నారు. అర్జీలు చేసుకుని నెలలు గడుస్తున్నా కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పై అధికారులకు అప్పీలు చేసినా పెండింగ్ తప్పడం లేదన్నారు. ప్రతి ప్రభుత్వశాఖలో సమాచారం ఇచ్చే అధికారులను వెంటనే నియమించాలన్నారు. కార్యక్రమంలో రిషి కుమార్, ఆంజనేయులు, స్రవంతి, వెంకటేశ్, కుర్మయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో 14పై పునరాలోచించండి

నర్వ, న్యూస్‌టుడే : నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి భూత్పూరు జలాశయం నుంచి నీటిని తీసుకునేందుకు తీసుకొచ్చిన జీవో 14 ద్వారా మక్తల్ ప్రాంతం ఎడారిగా మారుతుందని భారాస నాయకుడు వి.మహేశ్వర్‌రెడ్డి, విండో ఛైర్మన్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.లక్ష్మణ్ దుయ్యబట్టారు. సోమవారం నర్వలో భారాస కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కేవలం 1.3 టీఎంసీల సామర్థ్యం మాత్రమే ఉందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తాము తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు దండు అయ్యప్ప, డా.శంకర్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు వరిధాన్యం కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, న్యూస్‌టుడే : నిబంధనల మేరకు వరిధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం జిల్లా వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వానాకాలం వరి ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ అంతా సమన్వయంతో రైతులకు మేలు చేయాలని కోరారు. సన్న, దొడ్డు రకం ధాన్యం వేరువేరు కౌంటర్లలో కొనుగోలు చేసి రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అక్టోబరు 1నుంచి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన సౌకర్యాలు, ఇతరత్రా ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. గత ఏడాది రవాణా సమస్యలు ఈ సంవత్సరం తలెత్తకూడదన్నారు. సరిహద్దు చెక్‌పోస్టులలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. డీఎస్‌వో సుదర్శన్ మాట్లాడుతూ..కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కౌంటర్లు, కనీస మద్దతు ధర, గన్నీ బ్యాగులు తదితర అంశాలను తెలియజేశారు. శిక్షణ కలెక్టర్ గరిమ నరులు, డీపీవో జాన్ సుధాకర్, డీసీఎస్‌వో డీఎం దేవదాసు, డీఎస్పీ నల్లపు లింగయ్య, ఆర్డీవో మేఘా గాంధీ, డీఆర్డీవో మొగులప్ప, సింగిల్ విండో అధ్యక్షులు, ప్రత్యేక అధికారులు, ఐకేపీ అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేం: గరిమా



శిక్షణ కలెక్టరు నుంచి సత్కారం పొందిన మరికల్ పంచాయతీ సిబ్బంది

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : పంచాయతీలు, పట్టణాల్లో పారిశుద్ధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివని శిక్షణ కలెక్టర్ గరిమ నరుల అన్నారు. సోమవారం ఆమె మరికల్ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని తువ్వాళ్లతో సత్కరించారు. డీఆర్డీవో మొగులప్ప మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. ఎంపీడీవో కొండన్న, ఎంపీవో పావని, పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ధన్వాడ మండలంలోని గోటూర్ గ్రామంలోనూ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని కార్యదర్శి శేఖర్‌రెడ్డితో పాటు గ్రామానికి చెందిన పెద్దలు తువ్వాళ్లు కప్పి సత్కరించారు.

సార్వత్రిక పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

నారాయణపేట, న్యూస్‌టుడే : సార్వత్రిక పది, ఇంటర్ పరీక్షల నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలని శిక్షణ కలెక్టర్ గరిమ నరుల అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ, సంబంధిత అధికారులకు పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పదోతరగతికి సంబంధించి ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో 166 మంది అభ్యర్థులు, ఇంటర్మీడియట్‌కు సంబంధించి బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 350మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని అన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు. విద్యుత్తు సదుపాయం ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఏఎన్ఎంలు ఔషధాలతో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డీఈవో అబ్దుల్ ఘనీ, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

నిద్రలోనే హఠాన్మరణం

ఊట్కూరు, న్యూస్‌టుడే : నిడుగుర్తి గ్రామానికి చెందిన కుర్వ మొగులప్ప(45) గొర్రెలను మేత కోసం ఖమ్మం జిల్లాకు తీసుకెళ్లాడు. గొర్రెలను నిలిపి ఆదివారం రాత్రి కాపలా కాశాడు. తెల్లవారుజామున 4 గంటలకు వేరే కాపరిని నిద్ర లేపి, తాను నిద్రకు ఉపక్రమించాడు. సోమవారం ఉదయం మిగతా గొర్రెల కాపరులు నిద్ర లేపారు. నిద్రలోనే గుండెపోటుతో మొగులప్ప మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం ఉదయం స్వగ్రామానికి తీసుకొచ్చారు.

కుస్తీ క్రీడలో జిల్లాకు పేరు తేవాలి



ధన్వాడలో రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి తదితరులు

ధన్వాడ, న్యూస్‌టుడే : రెజ్లింగ్(కుస్తీ) పోటీల్లో జిల్లాకు మంచి గుర్తింపు తేవాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు కోరారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడోతేదీ నుంచి అయిదో తేదీ వరకు ధన్వాడలోనే రాష్ట్ర స్థాయి పోటీలు జరుగున్నాయని, అందులో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక కోసంఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎంఈవో గాయత్రి, జీహెచ్ఎం నర్సింహాచారి, పీడీలు నెల్సన్, వెంకటపతి, రవికుమార్, సాయినాథ్, కోచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకోండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : తల్లిదండ్రుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని చదువుకోవాలని ఎస్సై వెంకటేశ్వర్లు విద్యార్థులకు హితవు పలికారు. నారాయణపేట సాయి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కళాశాలలో చరవాణులను వినియోగించరాదని, రీల్స్ చూస్తు సమయం వృథా చేసుకోవద్దన్నారు. అతివేగంగా వాహనం తోలడం నేరమన్నారు. ఎస్సై గాయత్రి, కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ల డీడీలు వాపసు



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న కురువ సంఘం నాయకులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : గత ప్రభుత్వ హయాంలో రాయితీ గొర్రెల పథకానికి డీడీలు చెల్లించిన 295 సంఘాలకు రూ.1.29కోట్లు తిరిగి వారి ఖాతాల్లో జమ చేసినట్లు కురువ సంఘం జిల్లా అధ్యక్షులు పి.నాగరాజు తెలిపారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో తమ సమస్య పరిష్కారం అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, శరణప్ప, లింగప్ప, గజ్జలప్ప, అంజప్ప, రమేష్, నర్సింహా పాల్గొన్నారు.

అద్దె చెల్లించడం లేదని గురుకుల పాఠశాలకు తాళం



గేటుకు తాళం వేసి పాఠశాల ఎదుట నిల్చున్న భవనం యజమాని

ఇటిక్యాల, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు అద్దె చెల్లించడం లేదంటూ భవనం యజమాని గేటుకు తాళం వేసిన ఘటన ఎర్రవల్లి మండలంలో చోటుచేసుకుంది. 10 నెలలుగా అద్దె చెల్లించలేదని అడిగిన ప్రతిసారి రెండు మూడు రోజుల్లో చెల్లిస్తామంటూ గురుకుల అధికారులు కాలం గడుపుతున్నారని ఆరోపించారు. దీంతో సోమవారం ఉదయం ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెళ్లకుండా గేటుకు తాళం వేశారు. ఈ విషయంపై ఉపాధ్యాయులు జోనల్ అధికారి రజిని దృష్టికి తీసుకెళ్లగా భవనం యజమానితో చరవాణిలో మాట్లాడారు. బిల్లులు ప్రభుత్వానికి సమర్పించామని రెండు రోజులలో చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో తాళం తీశారు.

పీయూ ఆచార్యుడికి ప్రతిష్ఠాత్మక పురస్కారం

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయం(పీయూ) ఫార్మసీ విభాగంలో ఆచార్యుడిగా పనిచేస్తున్న డా.ప్రభాకర్‌రెడ్డి ప్రతిష్ఠాత్మక ఫార్మసీ టీచర్స్ ఆఫ్ ఇండియా పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఉత్కల్ విశ్వ విద్యాలయంలో ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

సాఫ్ట్‌వేర్ వదిలి... ఉపాధ్యాయ వృత్తిలోకి..



స్వప్న

ఊట్కూరు, న్యూస్‌టుడే : మక్తల్ మండలం జక్లేర్ గ్రామానికి చెందిన పసుల సత్యారెడ్డి , కమలమ్మ దంపతుల రెండో కుమార్తె స్వప్న ఎంసీఏ చదివి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేసేవారు. కొల్లూరు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డితో వివాహం అయ్యాక ఉద్యోగానికి స్వస్తి చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి పెంచుకుని బీఈడీ పూర్తి చేశారు. కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, ఇంటి వద్దే ఉంటూ డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. ఆన్‌లైన్‌లో నేర్చుకుంటూ విషయంపై పట్టు సాధించారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో గణితంలో ఓపెన్ కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్ మూడు పోస్టులున్నా, నిరుత్సాహపడకుండా చదివి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించారు.

ఎస్జీటీలో మొదటి స్థానం



ప్రియాంక

ఊట్కూరు, న్యూస్‌టుడే: ఎడవల్లి గ్రామానికి చెందిన గాండ్ల మంజుల, బస్వరాజ్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. 7 ఎకరాల మెట్ట పొలంలో వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండో కుమార్తె గాండ్ల గాండ్ల ప్రియాంక సోమవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో 87.37 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు సాధించారు.

ఆర్టీసీ కండక్టరుగా పనిచేస్తూ..

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ విభాగంలో మరికల్ మండలం జిన్నారం వాసి గోపాల్‌కు జిల్లా పరంగా రెండో ర్యాంకు వచ్చింది. తెలుగు మాధ్యమం పరీక్ష రాసిన గోపాల్‌కు 69.03 మార్కులు వచ్చాయి. ప్రస్తుతం గోపాల్ మహబూబ్‌నగర్ డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఊట్కూరు వాసులకు ర్యాంకులు



ప్రదీప్‌కుమార్ ఆర్.ఆంజనేయులు

ఊట్కూరు, న్యూస్‌టుడే : పులిమామిడి గ్రామంలోని సర్దార్‌కోట ప్రాంతానికి చెందిన ఆర్. వెంకటేశ్, నాగమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. తమకున్న నాలుగెకరాల పంట పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్ద కుమారుడైన ఆర్.ఆంజనేయులు తల్లిదండ్రులు పడుతున్న కష్టం , ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కష్టపడి చదివాడు డీఎస్సీలో బయోసైన్సులో జిల్లాస్థాయి రెండోర్యాంకు సాధించాడు. మండల కేంద్రానికి చెందిన గొల్ల ప్రదీప్ కుమార్ తెలుగు భాషా పండిట్ విభాగంలో 80.07 మార్కులు సాధించి రెండో ర్యాంకు సాధించాడు.

ఎస్జీటీకి రెండు ఎస్ఏ పోస్టులు



మాలపోల మహేష్

ధన్వాడ, న్యూస్‌టుడే : గున్ముక్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న మాలపోల మహేశ్‌కు సోమవారం విద్యాశాఖ విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో రెండు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు వరించబోతున్నాయి. ఆంగ్లంలో జిల్లాస్థాయి మొదటి ర్యాంకు సాధించాడు. సాంఘిక శాస్త్రంలో ఆరోర్యాంకు వచ్చింది. ఆయనది ఊట్కూరు మండలం కొల్లూరు.

విగ్రహ ఏర్పాటుకు వితరణ

నర్వ, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో అంబేద్కర్ కూడలిలోని కర్రెమ్మ ఆలయం వద్ద దేవీనవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయనున్న అమ్మవారి విగ్రహ ఏర్పాటుకు స్థానికుడు దండు అయ్యప్ప సోమవారం రూ.31వేలు నగదును వితరణ చేశారు.


లడ్డూ కల్తీ దోషులను శిక్షించాలి



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూలో కల్తీకి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు కె.సత్యనారాయణగౌడ్, పస్పుల భీమేశ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. పవిత్ర తిరుమల క్షేత్రంలో లడ్డూను కల్తీచేసి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, భీమన్న, జుట్ల హన్మంతు, మల్లికార్జునరావు, రాహుల్, రామాంజనేయులు, రఘుప్రసన్నభట్, శరణప్ప, కురుమయ్యలు పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతిక ప్రతీక బతుకమ్మ



బతుకమ్మ ఆడుతున్న ప్రిన్సిపల్, విద్యార్థులు, మహిళా అధ్యాపకులు

ధన్వాడ, న్యూస్‌టుడే : బతుకమ్మ తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అని ధన్వాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెర్సీ వసంత అన్నారు. సోమవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో విద్యార్థులతో కలిసి ఆమె పాల్గొన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో బతుకమ్మ పాత్ర విశిష్టమైనదిగా పేర్కొనవచ్చన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత బతుకమ్మ వేడుకలు రాష్ట్రం, దేశం, ఖండాతంరాలు దాటి నిర్వహిస్తుండటం గర్వకారణమన్నారు. ముగింపులో స్థానికంగా ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ కోనేరులో నిమజ్జనం చేశారు.